ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి,ఆగస్టు 2: పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతపద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వికారాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9701774143ని సంప్రదించవచ్చని సూచించారు.



ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఏకమై ప్రళయ గర్జన చేస్తున్నాయి. పంట పొలాలన్నీ నీటమునిగాయి. వాగు పరీవాహక ప్రాంతాల్లో పత్తి, మొక్క జొన్న, కంది, వరి, పసుపు, పూల తోటలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు ముంపునకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో చేసేదేమీ లేక రైతులు లబోదిబోమంటున్నారు. చాలా గ్రామాల్లో ఇళ్లు కూలాయి. పలుచోట్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి.

- పాక్షికంగా దెబ్బతిన్న 38 ఇళ్లు
- మోకిలలో జలదిగ్బంధంలో చిక్కుకున్న 'లా ఫాలోమా విల్లాలు'
- ఈసీ, మూసీ వాగుల ప్రళయ గర్జన
- జలాశయాలకు పోటెత్తిన వరద
- అలుగెత్తిన ప్రాజెక్టులు, చెరువులు
- లోతట్టు ప్రాంతాల్లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక పర్యటన


దౌల్తాబాద్: పత్తి చేలోకి చేరిన వర్షపు నీరు

వర్షార్పణం

ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు మునక

ఆంధ్రజ్యోతి, ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబరు 2: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈసీ, మూసీ వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ మయ్యాయి. వాగు పరివాహక ప్రాంతాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, వరి, పసుపు, కూరగాయల పంటలతో పాటు పూల తోటలు నీటమునిగాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో దాదాపు 1,270 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అందులో వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా వెయ్యి ఎకరాలకుపైగా కాగా , రంగారెడ్డి జిల్లాలో 270 ఎకరాలకు పైగా పంటలు నీటమునిగి నష్టం జరిగింది. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, ధారూరు, నవాబ్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్, పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లో మండలాల్లో వెయ్యి ఎకరాలకు పైగా పత్తి, మొక్కజొన్న, కంది, వరి, పసుపు పంటలతో పాటు కూరగాయ పంటలు నీట మునిగాయి. గూడు కట్టే సమయంలో వర్షాలు కురియడంతో పత్తి పంటకు ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అమ్డాపూర్ వాగు ఉగ్రరూపానికి గులాబీ, పత్తి పంటలు నీటమునిగాయి. సుమారు 150 ఎకరాలకు పైగా పంటలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. పంటపొలాల సమీపంలో వెంచర్ యజమాని వాగుకు అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టడంతోనే పొలాలన్నీ నీట మునిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. చౌదరిగూడ మండలంలో దాదాపు 120 ఎకరాలల్లో వరి, పత్తి పంట నీట మునిగాయి. అందులో కేశంపేట మండలం లింగంధన గ్రామానికి చెందిన రైతు రాంరెడ్డి 2 ఎకరాల బంతిపూల తోట దెబ్బతిన్నది. చేవెళ్ల డివిజన్ పరిధిలో సుమారు 70ఎకరాలకుపైగా పంటలు నీటమునిగాయని రైతులు పేర్కొంటున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. శంకర్‌పల్లి మండలం మోకిలాలో కోట్ల రూపాయల విలువగల లాఫాలోమా విల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. 212విల్లాలకు వెళ్లే దారులన్నీ నడుంలోతు నీటిలో ఉన్నాయి. విల్లాకు వెళ్లే దారులన్నీ నీటి ముంపునకు గరయ్యాయి. ఇంద్రానగర్ రైల్వే వీకర్ సెక్షన్ కాలనీలో రోడ్లు బురద మయంగా మారాయి.


పాత తాండూరులో వర్షానికి కూలిన ఇల్లు

కూలిన ఇళ్లు

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో మూడు ఇళ్లు, అలాగే తాళ్లపల్లిలో మరో ఇల్లు వర్షానికి పాక్షికంగా కూలాయి. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలో సుమారు 50 వరకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వికారాబాద్ జిల్లాలో 34 ఇళ్లకు పాక్షికంగా నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ వర్షాలకు జిల్లాలో కొడంగల్

మిగతా 7వ పేజీలో..

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	ప్రాంతం	వర్షపాతం (సెం.మీ)
రంగారెడ్డి జిల్లా		
శేరిలింగంపల్లి	గచ్చిబౌలి	9.7
సరూర్‌నగర్	ఎల్బీనగర్	6.2
షాబాద్	తాళ్లపల్లి	5.7
శంకర్‌పల్లి	శంకర్‌పల్లి	5.5
మణికొండ	గండిపేట	5.4
రాజేంద్రనగర్	రాజేంద్రనగర్	5.8
అబ్దుల్లాపూర్‌మెట్	అబ్దుల్లాపూర్‌మెట్	4.5
వికారాబాద్ జిల్లా		
మోమిన్‌పేట్	మోమిన్‌పేట్	5.6
కొడంగల్	కొడంగల్	4.9
పూడూరు	పెద్ద ఉమ్మెంతాల్	4.3
యాలాల్	యాలాల్	4.2
పరిగి	పరిగి	3.9
వికారాబాద్	మద్గుల్ చిట్టంపల్లి	3.9
తాండూరు	తాండూరు	3.5
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా		
కూకట్‌పల్లి	జీహెచ్ఎంసీ ఆఫీస్	8.5
కుత్బుల్లాపూర్	మహాదేవ్‌పురం	6.6
బాల్‌నగర్	మూసాపేట్	6.0
ఉప్పల్	ముసారాంబాగ్	5.1

నిండుకుండలా జలాశయాలు

వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి స్థాయిలో నిండాయి. కోట్‌పల్లి, లక్నాపూర్, శివసాగర్, జుంటుపల్లి, నందివాగు, సర్పన్‌పల్లి , కొంశెట్‌పల్లి ప్రాజెక్టులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. జూలై 3వ వారం వరకు కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి అంతంత మాత్రంగానే నీరు చేరుకోగా, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు చేరుకుంది. ఆరు ప్రాజెక్టులు ముందే అలుగెత్తగా, లక్నాపూర్ ప్రాజెక్టు ఆదివారం రాత్రి అలుగెత్తింది. కాగా భారీ వర్షాలకు దోమ మండల కేంద్రంలోని పెద్ద చెరువు తూముకు గండి పడింది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సోమవారం సంచుల్లో మట్టి నింపి వేయాలని గ్రామస్తులకు తెలిపారు. అలాగే దుద్యాల గోపెన్ చెరువు తూముకు గండి పడింది. నీరు బయటకు లీకేజీ అవుతోంది


కేశంపేట : లింగంధనలో వర్షానికి దెబ్బతిన్న బంతిపూల తోట


చేవెళ్ల: ఇబ్రహీంపల్లిలోని పత్తి చేలో నిలిచిన వర్షపు నీరు


గౌడవెల్లి-మేడ్చల్ వాగులో చేపలు పడుతన్న ప్రజలు

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

కలెక్టర్ శశాంక


ఉస్మాన్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న శశాంక

ఉస్మాన్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ఆయన ఉస్మాన్‌నగర్ లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. అక్కడ ప్రజలతో మాట్లాడారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపును నిర్వహించి అంటు వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్‌లను చేపట్టాలని తెలిపారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఊరేగింపు జరిగే మార్గాన్ని మరియు అందుకోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అంతేకాకుండా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని కాముని చెరువును కలెక్టర్ శశాంక ఇతర శాఖల అధికారుల తో కలిసి పరిశీలించారు చెరువు సమీపంలో ఉన్ను హైదరాబాద్ హౌస్, ప్యారడైజ్ హోటల్, శంషాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్, గెస్ట్‌హౌస్, చెరువుకట్టకు కుడివైపు ఉన్న మరికొన్ని కట్టడాలను పరిశీలించారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కాముని చెరువు ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కోత్వాల్ కూడా శివారులో గల హిమాయత్‌సాగర్ పక్కనున్న గెస్ట్‌హౌస్‌తో పాటు ఓ కన్వెన్షన్ కూడా పరిశీలించినట్టు తెలుస్తోంది. కలెక్టర్ వెంట మహేశ్వరం ఏసీపీ లక్ష్మికాంత్‌రెడ్డి, జిల్‌పల్లి మున్సిపల్ వాణిరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.


పరిగి మండలంలో అలుగు పోస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టు

కనుల పండువగా రామలింగేశ్వరుడి జాతర


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

బషీరాబాద్, సెప్టెంబరు 2: నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో ఏడు కొలనుల మధ్య వెలసిన ఏకాంబర రామలింగేశ్వరుడి జాతరకు భక్తులు పోటెత్తారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఆలయ పుష్కరణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి దర్శనం అనంతరం భక్తుల పక్కనే కొలుపై ఉన్న యాకుబ్‌సాబ్ దర్గాను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ఛైర్మన్ పి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పరమ శివుడి విగ్రహం, కలశాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం మహాశివుడి విగ్రహంతో రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. జాతరకు హాజరైన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడి ప్రత్యేక పూజలు చేయగా వారిని ఛైర్మన్, కమిటీసభ్యులు సన్మానించారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబరు 2 : ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో 71 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజావాణిలో భూ సమస్యకు సంబంధించి 59, పింఛన్లకు సంబంధించి 2, ఇతర వాటికి 10 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పేరుకే పెద్ద చెరువు

నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్న ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు భారీగా ఆక్రమణలకు గురైంది. అధికార యంత్రాంగం ఉదాసీనత, పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఎఫ్‌టీఎల్‌ను అక్రమార్కులు చెరబట్టారు. 30 - 40 ఏళ్లుగా ఎఫ్‌టీఎల్ హద్దులను మారుస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నా ఇదేంటని ప్రశ్నించేవారు కరువయ్యారు. దీంతో ఇప్పటికే సుమారు 40 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా ఉన్న చిన్న చెరువు సైతం కాలుష్యంతో నిండిపోయింది. కాగా, ఇటీవల హైడ్రా తెరపైకి రావడంతో అధికార యంత్రాంగం ఇప్పుడు మేల్కొంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏ మేరకు ఆక్రమణలు జరిగాయి. నిర్మాణాలు ఎన్ని ఉన్నాయంటూ సర్వే చేస్తూ లెక్కలు తీస్తున్నారు.

ఆక్రమణలకు గురైన ఇబ్రహీంపట్నం చెరువు

- ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను మార్చి నిర్మాణాలు
- 40 ఎకరాల మేర కబ్జాకు గురైనట్లు ఆరోపణలు
- వరద కాలువలను డైవర్షన్ చేసిన రియల్టర్లు
- మురికి కూపంగా మారిన చిన్నచెరువు
- 'హైడ్రా' రాకతో అధికారుల్లో కదలిక


ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన నిర్మాణాలు

కబ్జాల పర్వం 4

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)1,452.8 ఎకరాలుగా ఉంది. ఇప్పటికే సుమారు 40 ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఇందులో వందకు పైగా నిర్మాణాలు వెలిశాయి. గతంలోనే రియల్టర్లు ఎఫ్‌టీఎల్ హద్దులను తొలగించి లే అవుట్లను వేసి ప్లాట్లను విక్రయించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. పేద, మధ్య తరగతి జనం ఆ ప్లాట్లు కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అంతేగాక కొందరు రియల్టర్లు ఇళ్లు నిర్మాణం చేసి వాయిదాల పద్ధతిన, టోకున విక్రయించడంతో చిన్నా చితక వ్యాపారులు, ఉద్యోగులు కూడా అక్కడ ఇళ్లు కొనుగోలు చేశారు. ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు రుణం కూడా ఇచ్చింది. ఇక్కడ నిర్మించిన ఓ ఫంక్షన్‌హాల్ సైతం కొంతభాగం ఎఫ్‌టీఎల్ లోనే నిర్మించారు. అప్పట్లో ఇబ్రహీంపట్నం మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఈ నిర్మాణాలకు ఎడాపెడా అనుమతులు ఇచ్చారు. అయినా వీటిలో కొన్నింటికి అనుమతులు లేవని తెలుస్తోంది. పైగా గతంలో వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని చెరువులోనే పోయడంతో ఇది కుచించుకుపోతూ వచ్చింది. రాత్రిళ్లు మట్టిని తెచ్చి పోసి మరీ చెరువును ఆగం చేశారు. కొనుగోలుదారులు సైతం బయటకన్నా చెరువులోనైతే ప్లాట్లు తక్కువ ధరలకు పలుకుతున్నాయని చూశారేగాని ముందు వచ్చే ముప్పును గుర్తించలేకపోయారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ

మిగతా 7వ పేజీలో..

ఇళ్లల్లోకి చేరుతున్న వరద

కాగా 40 ఏళ్లుగా ఏనాడూ చెరువులోకి పూర్తి స్థాయిలో నీరు రాలేదు. 2022లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు నిండి అలుగుపారడంతో అక్రమణల భండారం పూర్తిగా బయటపడింది. ఇంకేం ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరడంతో ఆ ఇళ్లను ఖాళీ చేసి బయట తలదాచుకున్నారు. అప్పులుచేసి ఉన్న ఆస్తులను అమ్ముకుని రూ.లక్షలు పోసి ఎరక్కపోయి చెరువులో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేశామంటూ లబోదిబోమన్నారు. చెరువులో నీటి మట్టం తగ్గడంతో తిరిగి వచ్చి ఆ ఇళ్లలో చేరుతున్నారు. ఆనాడే ఎఫ్‌టీఎల్ హద్దులు తెలిసుంటే సామాన్యులకు ఈ పరిస్థితులు వచ్చి ఉండేది కాదు. రియల్టర్లు అందినకాడికి దండుకొని వెళ్లిపోయారు. హైడ్రా తరహాలో ఇక్కడ కూడా కూల్చివేతలు చేపడితే తమ గతేంటని ఆందోళనలో ఉన్నారు.

చెట్ల పొదల్లో పసికందు

- వదిలేసిన తల్లీదండ్రులు
- గౌడవెల్లిలో ఘటన

8


శిశువుతో తల్లి తులసి

రెసిడెన్షియల్ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి

మేడ్చల్ సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటిదగ్గరి కంటే రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే రక్షణ ఎక్కువగా ఉంటుందనే నమ్మకం తగ్గకుండా విద్యార్థులను చూసుకోవాలని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యుత్ సమస్యలు, తాగునీరు, సానిటేషన్, మరుగుదొడ్ల సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ స్కూల్స్‌ను నడిపిస్తున్నదని, చిన్నచిన్న సమస్యలతో అప్రతిష్టను తీసుకురావద్దని కలెక్టర్ సూచించారు. మేజర్ సమస్యలకు ప్రణాళిక తయారు చేసిరీజినల్ కో ఆర్డినేటర్‌కుపంపాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉండాలని, ముందుగా మెస్‌కమిటీ తిన్న తర్వాతనే పిల్లలకుపెట్టాలన్నారు. బాలికల రెసిడెన్షియల్ స్కూల్స్ వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

తాండూరు, సెప్టెంబర్ 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ రోడ్డు తులసీ నగర్ పాతకుంట మార్కేండేయ కాలనీ పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అధికార యంత్రాగంతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులున్న చోట అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తగా కబ్జాలపై డిజాస్టర్ మేనేజ్ మెంట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ నీటి పారుదల శాఖ, విద్యుత్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



తాండూరులో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2: 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్- 1, ఇంగ్లీష్-1 విభాగాల్లో ఖాళీలున్నట్లు చెప్పారు. అభ్యర్థులు పీజీ సబ్జెక్టులో జనరల్ 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్/సెట్, బోధనానుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

చెరువులు, కుంటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

నీటి పారుదల శాఖ ఎస్ఈ హైదర్‌ఖాన్



మహేశ్వరం : సూరం చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

మహేశ్వరం, సెప్టెంబరు 2 : చెరువులు, కుంటలను ఆక్రమిస్తే ఎవరైనా వ్యక్తులైనా ఉపేక్షించేది లేదని నీటిపారుదల శాఖ ఎస్ఈ హైదర్ ఖాన్ అన్నారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ సూరం చెరువుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలను మహేశ్వరం తహసీల్దార్ సైదులుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వాటిని పరిశీలిస్తున్నారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురైనట్లు పరిశీలనలో తేలితే నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని, తదనంతరం సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సర్వేలో చెరువులు, కుంటలు కబ్జాలకు గురైనట్లు తేలితే హైడ్రా అధికారులు వచ్చి వాటిని పూర్తిగా తొలగిస్తారని చెప్పారు. చెరువులు, కుంటల ఆక్రమణదారులే వాటి పునరుద్ధరణకు అయ్యే ఖర్చులను భరించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. తుక్కుగూడ సూరం చెరువును పూర్తిగా సర్వే చేస్తామని, చెరువు హద్దులను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈఈ సునీత, డీఈఈ దుద్యానాయక్, ఏఈఈ. గోవింద్, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

ఎదిర చెరువును సందర్శించిన అధికారులు



ఎదిర చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, సెప్టెంబరు 2: తూముకు గండి పడి నీరు వృథా పారుతోందని, తూము గండిని పూడ్చిన గ్రామస్తులు అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులు డిప్యూటీ డీఈఈ సత్యప్రకాశ్, ఏఈ సింధులు పరిశీలించారు. చెరువుకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏఈ తెలిపారు.

ప్రాణ నష్టం జరగకుండా చూడాలి

కందుకూరు, సెప్టెంబరు 2: కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రజలకు అంటు వ్యాధులు, ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి సురేష్‌మోహన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో సరిత ఆధ్వర్యంలో మండలంలోని కొత్తగూడలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేసే సమయంలో లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ప్రధాన వీధుల్లో శానిటేషన్‌తో పాటు కంపోస్టు యార్డు వద్ద తడి, పొడి చెత్తను వేరేచేసే ప్రక్రియపై సిబ్బందికి నోటీసులు ఎందుకివ్వలేదని పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీవో గీత ఉన్నారు.

గణేశ్ మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, సెప్టెంబర్ 2: గణేశ్ మండప నిర్వాహకులు ఆన్‌లైన్ నమోదు చేయించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గణేష్ మండప నిర్వాహకులు పోలీసుశాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు కొరకు పోలీస్ శాఖ అనుమతి నిమిత్తం హెచ్‌టీటీపీఎస్‌://పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.జీవోవీ.ఐఎన్/ఇన్‌డెక్స్.హెచ్‌టీఎం లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా పోలీసు వారికి లేదా డయల్ 100కు గానీ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670056 ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

మేడ్చల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించి బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ కోరారు. దీనిపై కలెక్టర్ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కులగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించి బీసీ కులాల లెక్కలు తీసి 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. లెక్కలు తేలిన తర్వాత రిజర్వేషన్ పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రం, ప్రధానకార్యదర్శి గౌతం ప్రజాపతి, సెక్రెటరీ శివతేజ, అర్జున్, సురేష్, మహేష్, మనోజ్‌యాదవ్ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈవో కృష్ణారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 2: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు అంటు వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు కృషి చేయాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం మండంలోని నేదునూరు ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో స్టాక్‌రూములు, మరుగుదొడ్లు, వంటగది, తరగతి గదులు, మెడికల్ క్యాంపులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించిందేకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఆయ పాఠశాలల ఇన్‌చార్జిలు శ్రీధర్, తీగల భార్గవి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, మరియు మండల వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

- సీజనల్ జబ్బులతో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాలో ఎక్కడా మందుల కొరత లేదు
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు



ఆమనగల్లు ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

ఆమనగల్లు, సెప్టెంబరు 2: భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్ రావు తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా యుద్ధ ప్రాతిపదికన చర్యలుచేపట్టడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీతతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు, పరిసరాలు, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కొనసాగుతున్న జ్వర సర్వే

ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా వర్షాలతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు ముందు జాగ్రతలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చినంత మాత్రాన ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలల్లో జ్వర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది జిల్లాలో చాలా వరకు వ్యాధులు తగ్గాయని తెలిపారు. 2002లో 753, 2023లో 565 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 210 మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. సమావేశంలో డాక్టర్లు పరిక్షిత్ నరేంద్ర, నాగరాజు, షైమునా, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షార్పణం

5వ పేజీ తరువాయి..

పరిధిలో 33 కేవీ, పరిగి పరిధిలో 11 కేవీ లైన్లకు సంబంధించి రెండువిద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లిందని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి తెలిపారు. కులకచర్ల మండలం ఇప్పయిపల్లి గ్రామంలో వెంకటయ్య ఇల్లు, కొత్తపల్లి గ్రామంలో లాలు ఇల్లు కూలింది. పాత తాండూరుగడి ప్రాంతంలోని తిమ్మనకు చెందిన ఇళ్లు కూలిపోయింది. కొడంగల్ మండలం కస్తూరిపల్లిలో 3 ఇళ్లు, అంగడి రైచూర్, పర్సాపూర్, రుద్రారంలో ఒక్కొక్క ఇల్లు చొప్పున కూలిపోయాయి

మత్తడి దూకుతున్న 690 చెరువులు

వికారాబాద్ జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కురిసిన వర్షానికి జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. సోమవారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు కోట్‌పల్లితో పాటు సర్పన్‌పల్లి, నందివాగు, జుంటుపల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి ప్రాజెక్టులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. కోట్‌పల్లిప్రాజెక్టులో 24 అడుగులు, సర్పన్‌పల్లి18, నందివాగు 16, జుంటుపల్లి 22, శివసాగర్ 9, అల్లాపూర్ 10, కొంశెట్‌పల్లి ప్రాజెక్టుల్లో 8 అడుగుల నీటి మట్టాలు దాటి అలుగెత్తాయి. జిల్లాలో 1,182 సాగునీటి వనరులుఉండగా, వాటిలో 690 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. 490 చెరువుల్లో 75 నుంచి 100శాతం నీరు చేరుకోగా, కేవలం 2 చెరువుల్లో మాత్రం 25శాతం లోపు నీరు చేరింది. వికారాబాద్, నవాబ్‌పేట్, ధారూరు మండలాల పరిధిలో 152 చెరువులు ఉండగా, 152 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. పెద్దేముల్, తాండూరు, బంట్వారం మండలాల పరిధిలో 104 చెరువులు ఉండగా, వాటిలో 104 చెరువులు కూడా అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. బషీరాబాద్, యాలాల్ మండలాల పరిధిలో 158 చెరువులు ఉండగా, వాటిలో 143 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తుండగా, 15చెరువుల్లోకి నిండుగానీరు చేరుకుంది. కోట్‌పల్లి, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల పరిధిలో 165 చెరువులు ఉండగా, వాటిలో 160 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తుండగా, మిగిలిన 5 చెరువులు నిండుకుండలా మారాయి. పరిగి నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లో 401 చెరువులు ఉండగా, వాటిలో 131 చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. 268 చెరువుల్లో 75 శాతం పైగా నీరు చేరుకోగా, 2 చెరువుల్లో మాత్రం 25 శాతం వరకు నీరు చేరింది. కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల్లో 202 చెరువులు ఉండగా, వాటిలో ఒక్క చెరువు కూడా ఇంకా అలుగెత్తలేదు. లక్నాపూర్ ప్రాజెక్టు నిండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

పరిగి-వికారాబాద్ మార్గంలో నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్కతల, టేకులపల్లి గ్రామాల మధ్యలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి వికారాబాద్ నుంచి శంకర్‌పల్లి కి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

యాచారం మండలంలో చుక్కనీరు రాలే..

రాష్ట్రమంతా భారీ వర్షాలు కురిసి వాగులు వంకలు పారుతుంటే యాచారం మండలంలో మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రెండు రోజుల పాటు మోస్తరు భారీ వర్షాలు కురిసినా మండలంలోని చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు రాలేదు. మండల పరిధిలో 120 వరకు చెరువులు, కుంటలున్నాయి. ఈ వానలకు చెరువులు, కుంటల్లో వరదనీరు చేరలేదు. ఉపాధి లేకుండా పోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లక్నాపూర్ ప్రాజెక్టులో చేపల వేట

పెరిగిన సందర్శకుల తాకిడి

వికారాబాద్ జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు అలుగెత్తి ప్రవహిస్తుండడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టులు, చెరువులు మత్తడి దూకడంతో సందర్శకులు, పర్యాటకులు వెళ్లి వీక్షిస్తున్నారు. కోట్‌పల్లి, లక్నాపూర్, శివసాగర్, జుంటుపల్లి, నందివాగు, సర్పన్‌పల్లి ప్రాజెక్టులకు సందర్శకుల తాకిడి పెరిగింది. పరిగి నియోజకవర్గంలోని లక్నాపూర్ ప్రాజెక్టును తిలకించేందుకు తరలివస్తున్నారు. వేలాది మంది సందర్శకులతో ప్రాజెక్టు ప్రాంతమంతా కిటకిటలాడింది. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అనంతగిరికి వచ్చే సందర్శకులు కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. అనంతగిరి అటవీ ప్రాంతానికి కూడా పోటెత్తారు. అటవీ ప్రాంతంలో పైనుంచి కిందకు ప్రవహించే వాటర్ ఫాల్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

తెరిపిచ్చిన వాన..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఆదివారం కురిసిన ముసురుతో జిల్లాలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. పలు చెరువులు మత్తడి దూకాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల చెట్లు రహదారులపై కూలగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం నుండి వరుణుడు శాంతించడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 400కు పైగా చెరువులు, కుంటలు ఉన్నప్పటికీ వందకుపైగా చెరువులు, కుంటలు పూర్తిగా నిండి మత్తడి పారుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్ మండలాల్లోని పలు చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. జిల్లాలో ఎటువంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరుగలేదని అధికారులు తెలిపారు.



ఆమనగల్లు : నిండుకుండలా మారిన సురసముద్రం చెరువు



నీరులేక వెలవెల బోతున్న యాచారం మండలం నజ్దిక్‌సింగారంలోని కుంట

వాగులో పడిన లారీ తొలగింపు

తాండూరు రూరల్: తాండూరు మండల పరిధి అల్లాపూర్ వాగులో కొట్టుకుపోయిన లారీని ఎట్టకేలకు జేసీబీతో మూడు గంటల పాటు శ్రమించి తీశారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆఖరి సోమవారం శ్రావణమాసం సందర్భంగా ఆలయాలకు వెళ్లేందుకు వాహనాలపై వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు.



క్రేన్ సాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం



శంకర్‌పల్లి మండలం మోకిలాలో జలదిగ్బంధంలో లాఫాలోమా విల్లా



దోమ పెద్దచెరువు తూమును పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



తలకొండపల్లి:అర్లకుంట తండాలో వర్షాలకు కూలిపోయిన బూగ్య ఇళు

వసతి గృహాలను శుభ్రంగా ఉంచాలి : డీడీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, సెప్టెంబరు 2: వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ తెలిపారు. సోమవారం జిల్లా అధికారులు ఆదేశాల మేరకు చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను వైద్యశాఖ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా వసతి గృహాల్లోని కిచెన్ షెడ్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరం సోకిన విద్యార్థులకు మందులు ఇవ్వాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని సూచించారు. శుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. వార్డెన్‌లు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ఆయనతో ఎంపీడీవో హిమబిందు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

పాటు కాలువకు అడ్డంగా కాంక్రీట్ గోడ

వెంటనే తొలగించాలి : బక్కని నర్సింలు



గోడ నిర్మాణంతో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న బక్కని నర్సింలు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 2: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ శివారులో ఉన్న వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా కాంక్రీట్ గోడ నిర్మాణంతో చెరువు నిండిన తర్వాత కాలువ ద్వారా నీరు వెళ్లడం లేదని, దానిని వెంటనే తొలగించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కాలువకు అడ్డంగా నిర్మించిన గోడను పరిశీలించారు. గతంలో గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు పంపించినా స్పందించడం లేదని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే గ్రామస్తులపైనే అక్రమ కేసులు పెట్టించారన్నారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. కాంక్రీట్ గోడను తొలగించచాలని డిమాండ్ చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి సన్మానం

వైభవంగా శ్రీరామలింగేశ్వరస్వామి జాతర

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండకు భక్తుల తాకిడి కొనసాగింది. ఉదయం నుంచి భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. సాయంత్రం గ్రామస్తుల ఆధ్వర్యంలో బండ్లు తిరిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఈవో సుధాకర్, అర్చకులు దశరథం, పాండు శర్మ స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంజీవ్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్యగుప్తా, వెంకటయ్య, ఎల్లప్ప, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ మండలంలో..



శ్రీఅంబురామేశ్వర ఆలయం వద్ద భక్తులు

పెద్దేముల్ : శ్రీ అంబురామేశ్వరస్వామి జాతర ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. పెద్దేముల్ మండలం తట్టెపల్లి సమీపంలోని అటవీప్రాంతంలో వెలసిన శ్రీఅంబురామేశ్వర దేవాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి దైవదర్శనం చేసుకున్నారు. అలాగే భక్తులకు అన్నదానం వితరణ కూడా జరిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, లొంక నర్సిములు, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ శంకర్, మండల అధ్యక్షులు గోపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం



శ్రీ రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం చేస్తున్న ఆలయ నిర్వహకులు

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామికి అన్నాభికం ఘనంగా జరిగింది. శ్రావణమాసోత్సవం సోమవారం అమావాస్యతో ముగిశాయి. నెల రోజులుగా వివిధ రూపాల్లో సేవలందుకున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి సోమవారం ఉదయం శ్రీ మహన్యాస పూర్వక రుద్రభిషేకంతో పూజలు ప్రారంభించారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్ అధ్వర్యంలో స్వామివారికి తైలాభిషేకం, వరి బియ్యంతో చేసిన అన్నంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు వితరణ చేయడంతో కీసరగుట్టలో శ్రావణమాసం పూజలు ముగిశాయి.

వైభవంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నఅర్చకులు

వికారాబాద్ : బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ కల్యాణంలో ఆలయ నిర్వాహకులు ఆత్మలింగం కుటుంబ సభ్యులు కూర్చొని తంతు జరిపించారు. వికారాబాద్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు, పట్టణ ప్రముఖులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అలాగే వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామ సమీపంలోని సంగయ్య లొంక సంగమేశ్వర ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో మదన్‌పల్లి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పేరుకే పెద్ద చెరువు

5వ పేజీ తరువాయి..

సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరు

పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లే వ్యవహరించారు. ఇక్కడ చెరువు ఆక్రమణలకు గురైనట్లు పాతిక, ముప్పై ఏళ్ల క్రితమే వచ్చిన ఫిర్యాదుల మేరకు అప్పట్లో భూ పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆక్రమణలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు.

వరద కాలువ మాయం

ఇదిలా ఉంటే చెరువుపై భాగాన వరద నీరొచ్చే కాలువ సైతం ఆక్రమణకు గురైంది. సీతారాంపేట్ ఏరియా నుంచి వచ్చే ఈ వరద కాలువపై పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. బస్ డిపోకు పక్కన వెలిసిన ఓ వెంచర్ అలీ మియా కుంట కట్టను తొలగించి కాలువ, బఫర్ జోన్‌ను ఆక్రమించి చదునుచేసి పైపులు వేశారు. ఈ వెంచర్‌కు హెచ్ఎండీఏ అనుమతులు కూడా ఉన్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఈ నాలా డైవర్షన్‌కు ఎన్ఓసీ ఇవ్వడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అప్పట్లో వరదలు వచ్చిన సమయంలో నీటి తాకిడికి వెంచర్ ప్రహరీ కూడా పడిపోయిందంటే పరిస్థితి ఏంటనేది తెలుస్తోంది. అప్పటి ప్రభుత్వంలో పెద్దల వత్తిడితోనే ఎన్ఓసీ ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ చదరపు గజం రూ.30-40 వేలు పలుకుతోంది. కాలువను పూడ్చి రూ.కోట్లు కొల్లగొట్టుకుపోతున్నారు. సర్వే నంబర్ 372లో 2.7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అలీమియా కుంటకూడా కుచించుకుపోయింది. ఇదిలా ఉండగా చెరువుకు దక్షిణాన చెర్లపటేల్‌గూడ రెవెన్యూ ఎఫ్‌టీఎల్‌లో కూడా లేక్ విల్లా ఆర్చర్డ్ గతంలో ప్లాట్లు చేసి విక్రయాలు జరపడంతో ప్లాట్ల కొనుగోలుదారులు ఆందోళనలో ఉన్నారు. అంతేగాక చెరువు పైభాగాన లేక్ విల్లా వేసిన వెంచర్‌లో కొంత భాగం ఎఫ్‌టీఎల్‌లో ఉందని మట్టిని పోసి ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి గతంలో ఈ వెంచర్‌ను సందర్శించి ఇది అక్రమమేనంటూ ఆరోపణలు చేశారు.

కులీకుతుబ్ షాహీల కాలం నాటి చారిత్రక నేపథ్యం కలిగిన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెరువు సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరైనట్లు ఇటీవలే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రకటించారు. ఇందుకుగాను హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు.



ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన నిర్మాణాలు

మురికి కూపంగా చిన్నచెరువు

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో భాగంగా ఉన్న చిన్న చెరువు మురికి కూపంగా మారి ముక్కుపుటాలదిరేలా కాలుష్యం వెదజల్లుతోంది. ఏపుగా ఆ చెరువు పరిధిలో పెరిగిన కంప చెట్లతో కనీసం కాలు పెట్టలేకుండా ఉంది. పైగా చెరువు పైన ఉన్న కాలనీలు, పంక్షన్ హాళ్లనుంచి వచ్చే మురుగుతో నీరంతా పచ్చగా కాలుష్యకారకంగా తయారైంది. చెరువు పక్కన కాలనీల్లో నివాసం ఉండే వారే గాకుండా కట్టపై వెళ్లే వాహదారులు కూడా ఈ కంపును భరించ లేకుండా ఉన్నారు.

త్వరలో పూర్తి నివేదికను సిద్ధం చేస్తాం

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై కల్టెకర్‌కు నివేదించాం. 2016లో ఈ చెరువు ప్రిలిమినరీగా నోటిఫై అయింది. ఎంతమేర ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరిగాయనేది సర్వే చేస్తున్నాం. త్వరలో పూర్తి నివేదిక అందజేస్తాం.

- రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ, ఇబ్రహీంపట్నం



చెరువులోకి పారుతున్న మురుగునీరు



ఇబ్రహీంపట్నం చెరువు

ఇబ్రహీంపట్నం ఏడీఏగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2: ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ)గా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరం ఏడీఏగా పనిచేసిన ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏడీఏగా ఉన్న వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేయడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుతుందన్నారు. తమ శాఖ తరపున విచారణ చేసి ప్రభుత్వానికి వివరాలు పంపుతున్నామన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

● రుణమాఫీ కానివారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

● వికారాబాద్ డివిజన్ ఏడీఏ స్వరూప

ధారూరు, సెప్టెంబరు 2: మండలంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని వికారాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు స్వరూప అన్నారు. ధారూరు రైతు వేదికలో సోమవారం రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. రేషన్‌కార్డు లేని రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల పేర్లను, ఆధార్‌కార్డు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి ప్రత్యేక యాప్ ద్వారా ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. అదేవిధంగా రుణఖాతాలో ఆధార్‌కార్డులో పేర్లు వేర్వేరుగా ఉన్న రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి సరిచేసుకోవాలని సూచించారు. ఆధార్‌లింకు లేని రైతులు లింకు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సంజూరాథోడ్, హరిప్రసాద్, మంజుల, రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యల పరిష్కారానికి కృషి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కులకచర్ల, సెప్టెంబరు 2: గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆగస్టు 27న 'గురుకులంలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలను, పాఠశాలను సోమవారం సందర్శించారు. అక్కడ భోజనాన్ని, సరుకులు, రికార్డులను పరిశీలించారు. అందులోని అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. గదుల్లో బల్బులు, ఫ్యాన్లు లేవని విద్యార్థులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహిళల సంక్షేమానికి పెద్దపీట

సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కులకచర్లలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బీమా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు తీసుకున్న రైతులకు తప్పకుండా రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌ణాయక్, యూత్ అధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

తాండూరు, సెప్టెంబరు 2: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం తాండూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాల, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిగి: నిరుపేదల గుండెల్లో వైఎస్ఆర్ దేవుడని పరిగి ఎమ్మెల్యేడీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం కోర్టుపక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ పావని, నాయకులు

మూడుచింతలపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, భూపాల్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

కులకచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహానాయకుడని కాంగ్రెస్ మేడ్చల్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ తెలిపారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఘనాపూర్, అంకుశాపూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కీసర: వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయమని కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం కీసరలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తాండూరు: వైఎస్సాఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఘట్‌కేసర్: వైఎస్సార్ సేవలు మరువలేని వని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో సోమవారం వైఎస్ఆర్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శామీర్‌పేట: శామీర్‌పేటలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌రహదారి ప్రధాన చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్లకు తాళం

● ప్రయాణికులకు తప్పని తిప్పలు



పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్లకు వేసిన తాళాలు

పరిగి, సెప్టెంబరు 2: పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగి బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ అధికా రులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు వసతులు కల్పించడంపై లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోయారు.. కొందరు ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తే బోరు చెడిపోయి నీరు రావడం లేదని, క్లీన్ చేసే సిబ్బంది లేదంటూ పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు వేస్తే కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలని మండిపడుతున్నారు. అదేవిధంగా బస్టాండ్‌లో తాగునీటి సదుపాయమూ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉచిత ప్రయాణం ఇస్తున్నామని కనీసం బస్సులు కూడా స్టేజిల వద్ద నిలపడం లేదని మహిళలు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మూత్ర శాలలు, మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చెట్ల పొదల్లో పసికందు

● వదిలేసిన తల్లిదండ్రులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 2: అప్పుడే పుట్టిన ఆడ శిశువును కన్న తల్లి కనికరం లేకుండా కర్కశంగా చెట్ల పొదల్లో పడేసింది. శిశువు ఏడుపు విన్న ఓ ఆటో డ్రైవర్ పొదల మధ్య ఉన్న శిశువును చూసి స్థానికులకు తెలుపగా చీమలు కొరికి, ముళ్లు గుచ్చుకుని రక్తపు మడుగులో అల్లాడుతున్న శిశువును కాపాడి తిరిగి తల్లి ఒడిలోకి చేర్చారు. ఈ ఘటన గౌడవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్ బిజయపూర్‌నకు చెందిన తులసి, సంతోష్ దంపతులు. ఆరేళ్లుగా గౌడవెల్లి గ్రామ సమీపంలోని స్టార్ పౌల్ట్రీఫామ్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. తులసి గర్భిణి కావడంతో భర్త సంతోష్ వైద్యపరీక్షల నిమిత్తం ఆమెను సోమవారం మేడ్చల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చాడు. తిరిగి పౌల్ట్రీఫామ్‌కు వెళ్తుండగా తులసికి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో మార్గమధ్యలోనే ఆడ శిశువును జన్మనిచ్చింది. ఆ ప్రదేశం నిర్మానుష్యంగా ఉండటంతో శిశువును ఓ కాగితంలో చుట్టేసి రోడ్డుపక్కన ఉన్న ముళ్ల పొదల్లో వదిలేసి అక్కడి నుంచి భర్తతో కలిసి పౌల్ట్రీఫామ్‌కు వెళ్లిపోయింది. కాగా గౌడవెల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆటోడ్రైవర్ అటు వైపు వెళ్లగా ఏడుపు చప్పుడు వినబడింది. దీంతో అవ్యక్తి స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు గ్రామ కార్యదర్శి మహిపాల్ రెడ్డికి విషయాన్ని తెలిపారు. దీంతో కార్యదర్శి సిబ్బందితో ముళ్ల పొదల వద్దకు చేరుకుని గాలించగా పొదల మధ్య రక్తపు మడుగులో శిశువు రోదిస్తూ కనబడింది. అనంతరం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేస్తున్న ఆశావర్కర్ లక్ష్మిని రప్పించి శిశువును పొదల నుంచి బయటకి తీశారు. అప్పటికే శిశువుకు ముళ్లు గుచ్చుకుపోవడంతో పాటు చీమలు పట్టి గాయాలయ్యాయి. వెంటనే శిశువును ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం తల్లిదండ్రుల గూర్చి ఆరాతీయగా అక్కడే ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యక్తులు శిశువును కనిపారేసిన వారి వివరాలు చెప్పడంతో కార్యదర్శి పౌల్ట్రీఫామ్ వద్దకు వెళ్లాడు. తులసి, ఆమె భర్తను నిలదీశారు. దీంతో వారు శిశువు తమదేనని ఒప్పుకోవడంతో తులసిని బిడ్డతో పాటు మేడ్చల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆమె భర్త సంతోష్‌ను మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. కాగా తనకు పుట్టిన బిడ్డ చనిపోయిందనుకుని కాగితంలో చుట్టేసి పొదల్లో వదిలేశానని, అయితే శిశువు బతికుందని అధికారులు తెలపడంతో నేనే పెంచుకుంటానని తులసి తెలిపింది.

కౌన్సెలింగ్ ఇచ్చి శిశువును అప్పగిస్తాం

శిశువును ఎలాంటి పరిస్థితుల్లో పొదలో వదిలేసి వెళ్లారన్న విషయం పట్ల విచారణ జరుపుతున్నామని మేడ్చల్ సీడీపీవో శారద అన్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రుల వద్ద నుంచి పూర్తి భరోసా తీసుకున్న అనంతరం శిశువును అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం శిశువును అమీర్‌పేటలోని శిశువిహార్‌కు తరలించామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



అజయ్‌తేజ మృతదేహం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2: అనుమానాస్పద స్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని ఏష్ టెక్నాలజీ సంస్థ మేనేజర్ మంద శ్రీకాంత్ తన జన్మదిన వేడుకలను ఆదివారం అర్ధరాత్రి ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్‌లోని వెంకటేష్‌కు చెందిన ఫాంహౌస్‌లో చేసుకున్నారు. ఈ వేడుకల్లో సంస్థలో పనిచేసే దాదాపు 20మంది పాల్గొన్నారు. మద్యం సేవించిన సాయికుమార్, రంజిత్‌రెడ్డిలు మద్యంమత్తులో తోటి ఉద్యోగైన గజాంబికల్ అజయ్‌తేజ(24)కు ఈతరాదని తెలిసి బలవంతంగా ఎత్తుకొని పక్కనే ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో పడేశారు. దీంతో ఈత రాకపోవడంతో అతడు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతన్ని జోడిమెట్లలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్‌తేజ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి మేనమామ కిషోర్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు శ్రీకాంత్, రంజిత్‌రెడ్డి, సాయికుమార్, ఫాంహౌస్ యజమాని వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 2: రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్(25)తన అక్క నాగలక్ష్మితో కలిసి సోమవారం బైక్‌పై మేడ్చల్ చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా సీజన్ బార్ వద్ద గల జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బైక్ అదుపుతప్పి ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా దుర్గాప్రసాద్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



పరమానంద బింద్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 2: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌లోని గయా పట్టణానికి చెందిన పరమానంద బింద్(50) రెండు నెలల కిందట పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఉంటూ కూలీపనులు చేస్తున్నాడు. ఈనెల 1వ తేదీన పరమానందబింద్ తన బంధువు శ్రీరామ్‌బింద్‌తో కలిసి ఘట్‌కేసర్‌లోని మొబైల్ దుకాణంలో సిమ్‌కార్డు తీసుకున్నాడు. శ్రీరామ్‌బింద్‌ను అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉండమని చెప్పి వెళ్లిన పరమానందబింద్ తిరిగి రాలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిదని, తెలిసిన వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న లారీ



చౌడాపూర్ సమీపంలో చెట్టును ఢీకొన్న లారీ

కులకచర్ల, సెప్టెంబరు 2: చౌడాపూర్ గ్రామ సమీపంలో ఓ లారీ అదుపు తప్పి చెట్టునుఢీకొంది. సోమవారం ఉదయం కులకచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు చౌడాపూర్ మీదుగా వెళ్తున్న లారీ చౌడాపూర్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. అదేవేగంతో చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ తమిళనాడుకు చెందిన చక్రవర్తి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 2: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయాలు జరిపే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మెడిసిటీ చౌరస్తా వద్ద ఉండే జగదీష్ సాహూ, నునావత్ రాజ్ కుమార్‌లు ఒడిశాకు చెందిన జగదీష్ బెహరా వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయించే వారని, సమాచారం మేరకు ఇద్దరినీ పట్టుకుని వారి వద్ద నుంచి 500గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.


బ్యాడ్మింటన్ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా



శ్రీనివాస్ గుప్తా

వనస్థలిపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడిగా టీపీసీసీ ప్రచార కమిటీ కో-చైర్మన్, నాగోల్‌కు చెందిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో క్రీడలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించడం హర్షనీయమన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. తనను మరోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమించడం హర్షనీయమన్నారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతీఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పి.శ్రీకాంత్, నరేందర్‌స్వామిలు, ప్రధానకార్యదర్శిగా ప్రభాకర్ భాస్కర్, సంయుక్త కార్యదర్శులుగా పిల్లలమర్రి రమేష్, నాగరాజు, కోశాధికారిగా హర్షయాదవ్, కార్యవర్గసభ్యులుగా షేక్‌రేష్మా, వేణుకుమార్, సీతల్ మోహన్‌దాస్‌లను నియమించారు.

ఝార్ఖండ్ వార్‌రూమ్ చైర్మన్‌గా కోల్కొంద సంతోష్‌కుమార్



రాహుల్‌గాంధీతో సంతోష్‌కుమార్ (ఫైల్)

వికారాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కోల్కొంద సంతోష్‌కుమార్ ఝార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ వార్ రూమ్ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి ప్రకటించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కీలక భూమిక పోషించే కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్‌కు సంతోష్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ధారూరు మండలం, తరిగోపుల గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీకి అత్యంత విధేయులైన 18మందిలో ఒకరుగా ఎదిగే స్థాయికి చేరుకోవడం విశేషం. చేసే పని పట్ల నిబద్ధత, నిజాయితీతో కష్టపడే సంతోష్‌కుమార్‌కు పార్టీ అధినేత్రి సోనియాగాంధీ వద్ద ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.

బన్సీలాల్ వ్యాస్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 2: గురుకుల్ పాఠశాల వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్ మహోన్నత ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్‌లో సోమవారం బన్సీలాల్ వ్యాస్ 68వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే గురుకుల్ పాఠశాలను స్థాపించి ఇక్కడి ప్రజలకు స్వాతంత్రోద్యమంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయుడు బన్సీలాల్ అని కొనియాడారు. అంతకుముందు బన్సీలాల్ వర్ధంతి సందర్భంగా అఖండ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుడు తాహేర్‌ఖాన్ మృతి

కొడంగల్, సెప్టెంబరు 2: కొడంగల్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు తాహేర్‌ఖాన్ మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానిక మైనారిటీ నాయకులు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం కొడంగల్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస ముగింపు పూజలు



తాండూరు రూరల్: రామలింగేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

మోమిన్‌పేట్, సెప్టెంబర్ 2: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం, రాళ్లగూడుపల్లి సమీపంలోని నంది వాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వెలిసిన శ్రీ రామలింగేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాండూరు రూరల్: జినుగుర్తి రామలింగేశ్వరస్వామి 41వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జిల్లా బీసీ నాయకులు పడగన్ ఉత్తంచంద్ దంపతులను ఆలయ పూజారి శివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మాజీ జడ్పీటీసీ ధారాసింగ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: శ్రావణమాసం ప్రారంభంమై నేటితో పూర్తికావడంతో ఆలయాలలో భజనలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలతో శ్రావణమాసం ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని పెద్దనందిగామ గ్రామంలోని శివాలయంలో భజనమండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు

కులకచర్ల: చౌడాపూర్ మండలం మరికల్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణ భగవానుడి ఊరేగింపు నిర్వహించారు. కృష్ణ భగవానుడి విగ్రహాన్ని గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగించారు.

కొడంగల్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా సోమవారం కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్‌గుప్త ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త ఎల్లయ్యగుప పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: నాగిరెడ్డిపల్లిలో వెలిసిన శ్రీ పార్వతీ పరమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షపాశం పోసి స్వామివారికి సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజిలయ్య, కేశవులు, వెంకటేశం పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణమాస చివరి సోమవారం, సోమవతి అమావాస్య పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగాన్ని జలం, పంచామృతంతో అభిషేకించారు. పూజారులు చెన్నబసవయ్య, కుమారస్వామిలు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

శామీర్‌పేట: శామీర్‌పేటలోని శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం (శివాలయం)లో ఆదివారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ భవానీరామలింగేశ్వర్ స్వామి ఆలయంలో ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. శామీర్‌పేట, తూంకుంటకు చెందిన భజన మండలి బృందం భజనలు చేశారు.



శామీర్‌పేట: శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్: మండల పరిధి కొర్రెములలోని శ్రీశ్రీశ్రీ బ్రహ్మసూత్ర నీలకంఠ మహాంకాళి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమావాస్య సందర్భంగా శివలింగంకు 108 బిల్వపత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఓరుగంటి కవిత, వెంకటేష్‌గౌడ్, ఆలయపూజారి మూర్తిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ముసురుతో బేజారు



కొడంగల్ రూరల్: పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

వికారాబాద్, సెప్టెంబర్ 2: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం సోమవారం సైతం ఉదయం నుంచి కురుస్తూనే ఉంది. అయితే ఆదివారం వరకు దంచి కొట్టిన వాన సోమవారం మాత్రం ముసురు వర్షంతో సరిపెట్టింది. ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడంతో పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు సైతం అవసరమైతే తప్ప బయటకు రాలేదు. జిల్లాలో అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతు వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో పర్యటించి పంట నష్టం వివరాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జ్యోతి, ఏఈఓ కావ్య ఉన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మూడురోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం ఉదయం ముసురుకురవడంతో జనాలు ఇళ్లకే పరిమితయ్యారు. మూసినది ఉధృతంగా ప్రవహించింది.

తాండూరు: కురుస్తున్న వర్షాలతో కాగ్నా జలకళ సంతరించుకుంది. కోకట్ కాగ్నానది వంతెనకు మట్టంగా నీరు పారుతుండగా, కాగ్నాలో జలసవ్వడిని తిలకించేందుకు తాండూరు ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తిలకించారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ గాంధీనగర్ హరిజన్ చేరి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గత రెండు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన వర్షపు నీరు చేరి నిలవడంతో చిన్న పాటి కుంటను తలపిస్తోంది.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** ఆస్పత్రుల్లో మహిళల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి మహిళా సిబ్బందితో పాటు వైద్యంకోసం వచ్చే మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఆస్పత్రిలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

● **శామీర్‌పేట:** రోగులకు అవసరమైన సేవలను అందుబాటులో అందించడమే ఘనపూర్ మెడిసిటీ ఆస్పత్రి ధ్యేయమని మండల కాంగ్రెస్ నాయకుడు, పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు బండి రాంరెడ్డి అన్నారు. అలియాబాద్‌లో సోమవారం ఘనపూర్‌కు చెందిన మెడిసిటీ ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటుచేసిన ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆయన ప్రారంభించారు.

● **మోమిన్‌పేట్:** దేవరంపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లనోళ్ల మహేందర్‌రెడ్డి మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చైర్మన్‌గా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

● **పరిగి:** ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రంగారెడ్డి-నల్గొండ జిల్లాల లాజిస్టిక్ అధికారి రవీందర్ అన్నారు. కర్ణాటకలోని గుల్బర్గా పరిగి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సోమవారం టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్‌ను ప్రారంభించారు. అదేవిధంగా పరిగి పట్టణంలోని బహార్‌పేట చౌరస్తాలో కూడా కొత్త కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భానుప్రసాద్, విశ్వనాథ్‌గౌడ్, వసంత్, ప్రసాద్, ఏజెంట్లు పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని హుసేన్‌పూర్ గ్రామ పంచాయతీ కొండన్న ఇటీవల కలెక్టర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నారు. కొడంగల్ పట్టణంలోని ఐబీలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు రమేశ్‌బాబు, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు వెంకటప్ప పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా సీఎంఆర్ఎఫ్

కీసర రూరల్, సెప్టెంబరు 2: సీఎం సహాయనిధి ఆపన్నులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న నాగారం మున్సిపాలిటీ బ్రహ్మయ్య కాలనీకి కుందన్‌పల్లి మాధవికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,5,500ల చెక్కును సోమవారం ఆయన నివాసంలో బాధితురాలి భర్త కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో గూడూరు ఆంజనేయులుగౌడ్, మధు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి స్థలానికి ప్రహరీ నిర్మిస్తాం

తాండూరు, సెప్టెంబరు 2: హిందూ ఉత్సవ సమితి కోసం గతంలో స్థలం కేటాయించడం జరిగిందని ప్రస్తుతం రూ.25లక్షలతో ప్రహరీ నిర్మిస్తామని మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం హిందూ ఉత్సవ నూతన కమిటీ అధ్యక్షులు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి మహేందర్‌రెడ్డిని సన్మానించారు. ఉత్సవాలకు సహకరించాలని కోరారు.

బొంరాస్‌పేట్ మండల వ్యవసాయాధికారిగా తులసి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 2: మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా తులసి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఆమె చేవెళ్ల మండలం నుంచి బొంరాస్‌పేట్‌కు బదిలీపై వచ్చారు.